www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 20 అక్టోబర్ 2024
5
అన్నమయ్య



మానవ అక్రమ రవాణా తీవ్రమైన నేరం : జడ్జి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మానవ అక్రమ రవాణా లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని మదనపల్లె ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వెంకటేశ్వర నాయక్ పేర్కొన్నారు. శనివారం గ్రామజ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో ఎ21 ఆస్ట్రేలియా ద మూవ్మెంట్ ఇండియా ముంబై శ్యామ్ వారి సహాయ సహకారంతో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో వాక్ ఫర్ ఫ్రీడమ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవ అక్రమ రవాణాపై ప్రజలను చైతన్యం చేసే దిశగా విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని, తీవ్రమైన నేరమన్నారు. మహిళలు, పురుషులు, చిన్న పిల్లలు అక్రమ రవాణా జరిగినట్లు గుర్తించిన వారు హెల్ప్ లైన్ నెంబర్ 1098-181100 కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ చాంద్ బాషా, పట్టణ ప్రముఖులు పలువురు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న జడ్జి

దారుణం

- ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ దాడి
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కడప జిల్లా ఎస్‌పి
- విద్యార్థినితో వాంగ్మూలం నమోదు చేసిన జడ్జి
- పోలీసుల అదుపులో నిందితుడు?


పెట్రోల్ దాడిలో తీవ్రంగా గాయపడిన బాలిక దస్తగిరమ్మ

ప్రజాశక్తి-గోపవరం/బద్వేలు

ఎన్ని కఠిన చట్టాలు అమలైన విద్యార్థినిలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. మానవ మృగాల ప్రవర్తనలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. తాజాగా తనను ప్రేమించడం లేదని ఇంటర్మీ డియట్ విద్యార్థినిపై ఓ ప్రేమోన్మాది పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన కడప జిల్లా బద్వేలు నియో జక వర్గంలోని గోపవరంలో శనివారం చోటు చేసుకుంది. విద్యార్థినిపై పెట్రోల్ దాడి ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే...బద్వేల్ పట్టణంలోని రామాంజనేయ నగర్‌కు చెందిన దస్తగిరమ్మ(17) ఒక ప్రయివేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదు వుతుంది. శనివారం ఉదయం కళాశాలకు ఇంటి నుంచి బయలుదేరిన దస్తగిరమ్మను మాట్లాడాలని బైక్‌పై ఎక్కించుకొని మండల పరిధిలోని సెంచరీ ప్లైవుడ్ వద్ద నిర్మాణుశ్య ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ అతని ప్రేమను తిరస్కరించడంతో జక్కుల విగ్నేష్ పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటలు తాళలేక బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని బాలికను 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలిక శరీరం 80 శాతంపైగా కాలిపోవడంతో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. విగ్నేష్‌కి ప్రేమ వివాహమై భార్య గర్భవతిగా ఉంది. దస్తగిరమ్మకు, విగ్నేష్‌కు మధ్య ఏం జరిగిందనే దానిపై పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని నుంచి జిల్లా జడ్జి వాంగ్మూలం నమోదు చేసు కున్నా రు. ప్రేమ పేరుతో 8వ తరగతి నుంచే విఘ్నేశ్ తమ కుమార్తెను వేధిస్తు న్నాడని బాధితురాలి తల్లిద ండ్రులు ఆరోపించారు. అతనికి వివాహమైనా వేధింపులు ఆపలేదని, ఇవాళ పెట్రోల్ పోసి నిప్పంటించాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న బద్వేల్ ఎమ్మెల్యే సుధా రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.


మాట్లాడుతున్న కడప జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

నిందితుడి కోసం గాలింపు ముమ్మరం : ఎస్‌పి

గోపవరం సమీపంలో ఇంటర్ విద్యార్థినిపై విగ్నేష్ అనే యువకుడు పెట్రోలు పోసి దాడి చేసిన ఘటనపై నాలుగు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టామని ఎస్‌పి హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొం దుతున్న విద్యా ర్థిని పరిస్థితిపై ఆరా తీశారు. అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యార్థినికి 80 శాతం వరకు గాయాలయ్యాయని తెలిపారు. చిన్నప్పుడు నుండి యువ కుడు విగ్నేష్ విద్యార్థినికి పరిచయం ఉందని తెలిపారు. ఇద్దరూ బద్వేల్ పట్టణంలోని రామా ంజనేయనగర్‌కు చెందిన వారిని వెల్లడించారు. నిందితుడి కోసం నాలుగు ప్రత్యేక బృదాలతో గాలింపు చర్యలు చేస్తున్నామని తెలిపారు. నిందితుని త్వరలో అరె స్టు చేసి వాస్తవాలను వెలికితీస్తామన్నారు. దస్తగిరమ్మకు, విగ్నేష్‌కు మధ్య ఏం జరిగిందనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నిందితుడిని అరెస్టు చేయండి : చంద్రబాబు

ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ దాడి ఘటనపై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. అధికారులతో మాట్లా డారు. విద్యార్థిని ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని అధికారులను ఆదేశించారు.


కుమార్తెను చూసి విలపిస్తున్న బాధితురాలి తల్లి

సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఎప్పుడో!



- 16 నాటి ఎన్నికల నోటిఫికేషన్ వాయిదా
- ప్రశ్నార్థకంగా సభ్యత్వ నమోదు
- ఎన్నిక నిర్వహణపై రైతుల్లో చర్చ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ ఎప్పుడో తెలియడం లేదు. ఇటీవల రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఈ నెల 16న సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని, 40 రోజుల్లోపు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. నీటి పారుదలశాఖ జిల్లా అధికార యంత్రాంగాలు ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాయి. చెరువుల వారీగా ఎన్నికల అధికారుల నియామకాల్ని పూర్తి చేశాయి. సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడానికి వెనుకంజ వేసింది. ఎన్నికల నిర్వహణకు వెనుకంజ వేయడానికి గల కారణాలు ఏమి ఉంటాయనే అంశంపై చర్చనీయాంశంగా మారింది.

కడప జిల్లాలో 206, అన్నమయ్య జిల్లాలో 94 సాగునీటి సంఘాలు ఉన్నాయి. కడప జిల్లా సాగునీటి పారుదలశాఖ పరిధిలో ఆరు ఇరిగేషన్ సర్కిల్స్ పరిధిలోని మైనర్ 112, మీడియం 16, మేజర్ 78 వెరసి 206 సాగునీటి సంఘాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద 94 సాగునీటి సంఘాలు ఉండడం గమనార్హం. 2015లో అప్పటి టిడిపి సర్కారు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం తెలిసిందే. సుమారు పదేళ్లుగా సాగునీటి సంఘాలు మనుగడలో లేకపోవడంతో రైతుల్లో ఉత్సాహం కొరవడినట్లు కనిపిస్తోంది.

సభ్యత్వం ఏదీ!

ఎన్నికల నోటిఫికేషన్ వాయిదా పడడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. కీలకమైన సభ్యత్వ నమోదు, ఎన్నికల యంత్రాంగాల నియామకాలకు బ్రేక్ పడింది. ఉమ్మడి జిల్లాల్లోని ఆయా చెరువుల పరిధిలోని సాగు విస్తీర్ణాన్ని బట్టి వందలాది మంది రైతులు కదిలించే ప్రయత్నం నిలిచిపోయింది. సభ్యత్వ నమోదు పన్ను చెల్లించడం మొదలగు నిబంధనల ప్రయాస తప్పింది. రెం డేళ్లుగా వర్షాలు లేక పంటలు పండని నేపథ్యంలో ఎంతమంది రైతులు సభ్యత్వ నమోదుకు ముందుకొస్తారనే అంశంపై నెలకొన్న సంది గ్ధతకు తెరపడింది.

నిలుపుదల వెనుక మతలబేమిటో!

సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ నిలుపుదల వెనుక కారణాలేమిటనే చర్చ నడుస్తోంది. సాగునీటి సంఘాల ఎన్నికల్లో ప్రతిపక్ష వైసిపి అధిక సంఘాలను గెలిస్తే కూటమి సర్కారు పరపతి తగ్గుతుందనే సందేహం తలెత్తిందా అనే సందేహం కలిగిందేమోననే వాదన వినిపిస్తోంది. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ వైఖరితో జిల్లాల్లోని నీటి పారుదలశాఖ ఉన్నతాధికారుల్లోనూ ఆసక్తి సన్నగిల్లింది. సాగునీటి సంఘాల ఎన్నికల ప్రస్తావనే రాగానే కడప, అన్నమయ్య జిల్లాల ఇంజినీరింగ్ యంత్రాంగరం ఆయా మండలాల వారీగా చెరువుల జాబితా సేకరించింది.అనంతరం అసిస్టెంట్ ఇంజినీరింగ్ స్థాయి అధికారులను నియామకాలను సైతం పూర్తి చేసింది. ప్రభుత్వం ఉన్న ఫళంగా నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో ఎన్నికల నిర్వహణ పనులను నిలిపేశారు. ప్రభుత్వంలో ఊగిసలాటకు ఎప్పుడు తెర పడుతుందో వేచిచూడాల్సి ఉంది.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - రాయచోటి

మున్సిపల్ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఎక్కువగా ఉందని, అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించి సమస్యను పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్, జాబిర్‌డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన దశలవారి ఆందోళనలో భాగంగా శనివారం డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని మేనేజ్మెంట్లలో పండిట్, పిఇటి పోస్టులు అప్ గ్రేడ్ అయ్యాయని, మున్సిపల్ పాఠశాలలో కాలేదని వారు అన్నారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎం, అర్బన్ ఎంఇఒ ప్రమోషన్‌లు కల్పించాలని పేర్కొన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, బదిలీలు వెంటనే చేపట్టాలని, నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని వారు డిమాండ్ చేశారు. పై సమస్యలు పరిష్కారం కాకపోతే ఈనెల 24 న డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, జిల్లా సహాధ్యక్షులు శివారెడ్డి, హేమలత, జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య, భాస్కర్ రెడ్డి, ఆదినారాయణ, వెంకటరమణ, దావుద్దీన్, ఎపిఎంఎస్‌టిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, కిఫాయత్, నరసింహారెడ్డి, శశిభూషణ్ పాల్గొన్నారు.



డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండాలి

- డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య


చింతపర్తి పిహెచ్‌సిలో తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ కొండయ్య

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని అన్నమయ్య జిల్లా డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య అన్నారు. శనివారం మండలంలోని చింతపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కాలానుగున వ్యాధులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. పంచాయతీల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌లు పంచాయతీ అధికారుల సహాయంతో శుభ్రం చేయించి నీరు నింపే ప్రతిసారి క్లోరినేషన్ చేయించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన అంటు వ్యాధులు ధరి చేరవన్నారు. పిహెచ్‌సిలో ప్రతి నెల పది కాన్పులు తగ్గకుండా గర్భవతులను ప్రోత్సహించాలన్నారు. పాము, కుక్క కాటు మందులు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ శ్రీవిద్య, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సూపర్‌వైజర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అఖిల భారత ఆత్మీయ పురస్కారాలకు 'పసుపులేటి'కి ఆహ్వానం



ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆంధ్రప్రదేశ్ కల్చరల్ అవేర్నెస్ సొసైటీ, అర్పిత సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరుగనున్న 24వ ఆత్మీయ పురస్కారాల ప్రధానోత్సవానికి రాజంపేట స్పెషల్ జ్యుడిషల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్‌ను గెస్ట్ అఫ్ హానర్‌గా కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ విజయకుమార్ నుంచి ఆహ్వానం అందినట్లు మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ శనివారం తెలియజేశారు. విజయ వాడలోని ఆంధ్రప్రదేశ్ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 21న ఈ కార్యక్రమం జరుగనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టిటిడి మాజీ జెఇఒ బి.లక్ష్మి కాంతం ముఖ్యఅతిధిగా, విశాఖపట్నంకు చెందిన అరుణ్ కుమార్ హానరబుల్ అతిధిగానూ, విజయవాడ గుణదల కార్పొరేటర్ సునీత ప్రత్యేక అతిధిగా పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ రంగాలలో ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన వారికి ఆంధ్రరత్న పేరుతో సత్కారాలు అందజేసి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారని నిర్వాహకులు విజయ కుమార్ ఆహ్వాన పత్రంలో పేర్కొన్నారు.

సామాజిక సేవలో గంగిరెడ్డికి డాక్టరేట్

ప్రజాశక్తి-పీలేరు : పీలేరుకు చెందిన సామాజిక సేవా కార్యకర్త, పాత్రికేయుడు జానం గంగిరెడ్డి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్ హిమాయత్ నగర్ లోని అలైడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియంలో శుక్రవారం ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా పలువురు రచయితలు, గాయకులు, కళాకారులు, సాంఘిక సేవకులకు గౌరవ డాక్టరేట్ పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు సినీ అవార్డులను కూడా అందజేశారు.

వన్ స్టాప్ సెంటర్‌లో జడ్జి తనిఖీ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్/ రాయచోటి : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమాదేవితో కలిసి మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మెన్ కృష్ణన్ కుట్టి శనివారం వన్ స్టాప్ సెంటర్ ను తనిఖీ చేశారు. ముందుగా పలు రికార్డులను పరిశీలించారు. వన్ స్టాప్ సెంటర్లో వస్తున్న కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మహిళలు లైంగిక వేధింపులు, గృహహింస, బాల్య వివాహాలు, వివాహేతర సంబంధాలు, బెదిరింపులు తదితర సమస్యలతో వస్తూ ఉంటారని వారికి బాధ్యతాయుతంగా సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం వన్ స్టాప్ సెంటర్ ప్రయివేట్ భవనాలల్లో నడుస్తోంది, ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చడానికి సన్నాహాలు జరుగుతున్నాయని అన్నారు. అనంతరం అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చి వారి పనితీరుకు అభినందించారు. కార్యక్రమంలో సిడిపిఒ వినోద్, వన్ స్టాప్ సెంటర్ నిర్వాహకులు ప్రభావతి, లీగల్ సర్వీస్ చంద్రకళ, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు. **కోర్టు భవనాలను పరిశీలన..** మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాయచోటి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాల మోల్డింగ్ పాడైపోయే దుస్థితిని చూసి రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి ఆచార్యాన్ని వ్యక్తం చేశారు. రాయచోటి పాత కోర్టు భవనాల సముదాయ ప్రాంతంలో అడిషనల్ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు కోసం 2014లో ప్రత్యేకంగా కొత్త భవనాన్ని నిర్మించారు. మోడలింగ్ వేసిన సందర్భంలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో మౌల్డింగ్ పై వర్షాకాల సమయంలో నీరు నిలుస్తోంది. ఈ విషయం ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి దృష్టికి రావడంతో శనివారం సాయంత్రం కోర్టు బిల్డింగ్‌ను పరిశీలించారు పదేళ్లకే బిల్డింగ్ ఈ స్థితికి రావడం చూసి ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రోడ్లు భవనాల శాఖ వారు బిల్డింగ్ లోపాలను సరిదిద్దకపోతే, 20 సంవత్సరాల కాకమునుపే భవనం కూలిపోయే ప్రమాదముందని అభిప్రాయపడ్డారు.

మహాయజ్ఞంలా మొక్కలు నాటాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలో మహాయజ్ఞంలా మొక్కలు నాటాలని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా వెల్లడించారు. శనివారం స్థానిక శేష్‌మహల్ థియేటర్ సమీపంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పచ్చదనం-చల్లదనం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం కాలుష్యం అమాంతం పెరిగిపోయి వాతావరణం కలుషితం ఎక్కువైపోయిందన్నారు. ఈ నేపథ్యంలో కాలుష్యాన్ని నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపుతున్నాయన్నారు. మదనపల్లి పట్టణ ప్రజలు ప్రతీ వారం మొక్కలు నాటాలని పిలుపునివ్వడంతో ఇప్పటికే అధిక సంఖ్యలో మొక్కలు నాటడం జరిగిందన్నారు. పదివేల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని త్వరలోనే లక్ష్యాన్ని అధిగ మిస్తామన్నారు. కార్యక్రమంలో సిఐ చాంద్‌బాషా, టిడిపి నాయకులు నవీన్ చౌదరి, పూలకుంట్ల హరిబాబు, శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

ప్రజాశక్తి-వాల్మీకిపురం: మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో రోడ్లను శుభ్రం చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, ఇండ్ల పరిసరాల్లో మురుగునీరు, వర్షపు నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని, నీరు నిల్వలు ఉండడం వలన దోమలు వృద్ధి చెందుతాయని సూచించారు. ఎప్పకప్పుడు మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వలన మనతో పాటు పక్కనవారు కూడా ఆరోగ్యంగా జీవించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆనంద్ కుమార్, రవి ప్రకాష్, రమణారెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

యువత వ్యాపార రంగంలో రాణించాలి :'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : నేటి యువత వ్యాపార రంగంలోనూ రాణించి సమాజానికి తమ వంతు సహకారం అందించాలని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయ కర్త యల్లటూరు శ్రీనివాసరాజు తెలిపారు. భువనగిరిపల్లెకు చెందిన జనసేన నాయకులు పూల మురళి రాజంపేట బైపాస్ నందు మీనాక్షి ట్రేడర్స్ ను నూతనంగా ప్రారంభించారు. శనివారం మురళి ఆహ్వానం మేరకు శ్రీనివాసరాజు దుకాణంను సందర్శించి మురళికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు పూల మురళి, కోలాటం హరికృష్ణ, చింతల శివ, కిరణ్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లి :ఆర్టీసీ బస్టాండ్‌లో నిద్రిస్తున్న పేదలు, వయోవృద్ధులు, యాచకులకు దుప్పట్ల పంపిణీ చేశామని లయన్స్ అభయ మదనపల్లి అధ్యక్షులు లయన్ కె.సుధాకర్‌రెడ్డి, దేశాయ్ జయదేవరెడ్డి తెలిపారు. సేవా కార్యక్రమంలో భాగంగా అభయ లయన్స్ క్లబ్ నిర్వాహకులు పేదలు, వృద్ధులు, యాచకులు శ్రేయస్సు కోసం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ అభయ సభ్యులు దండు శేఖర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తి, కె.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ : జడ్జి

ప్రజాశక్తి-పీలేరు : డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని 11వ అదనపు జిల్లా జడ్జి ఎ.మహేష్ తెలిపారు. శనివారం స్థానిక 11వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో న్యాయమూర్తి న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ కోర్టు ఆవరణంలో జరిగే జాతీయ లోక్‌దాలత్‌కు కక్షిదారులు అధిక సంఖ్యలో హాజరై తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు న్యాయవాదులు వారికి అవకాశం కల్పించాలని తెలియజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఆర్.చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాదులు, ఇన్సూరెన్స్ న్యాయవాదులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం : గత 24 ఏళ్లుగా ఒప్పంద పద్ధతిపై విధులను నిర్వహిస్తున్న అధ్యాపకులకు గత ప్రభుత్వం క్రమబద్ధీకరణకు జిఒ ఇచ్చి.. ఎన్నికల కోడ్ అంటూ నిరాశ మిగిల్చిందని స్థానిక పివిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు మండిపడ్డారు. శనివారం పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరై నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరణకు వివిధ కమిటీలను వేసి కాలయాపన చేసిందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో జిఒ 114 ఇచ్చి ఎన్నికల కోడ్ అమలులో ఉందంటూ ఆర్డర్ కాపీ ఇవ్వకుండా తీవ్ర నిరాశ మిగిల్చిందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా తాము ఒప్పంద అధ్యాపకులుగానే కొనసాగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వమైన తమ సేవలను గుర్తించి ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసాద్, చంద్రశేఖర్, జానిబాబు, రమణ, నాగేంద్ర, పరమేశ్వర రెడ్డి, రవి, నరసింహులు, నళిని, స్వప్న, శంకర కళావతి, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల వారోత్సవాలు విజయవంతం చేయండి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : పోలీసు అమరవీరుల వారోత్సవాలను విజయవంతం చేయాలని అన్నమయ్య జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. ఈనెల 21 నుంచి అమరులైన పోలీసులను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడుతూ వారోత్సవాలను ఘనంగా నిర్వహించేలా పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని అన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అమర పోలీసులను గుర్తు చేసుకోవడంతో పాటు సమాజంలో కీలకమైన పోలీసు పాత్ర విధులు, త్యాగాలు గురించి ప్రజల్లో అవగాహన తీసుకురావడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈనెల 21 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు విద్యార్థులకు, ప్రజలకు పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, పరికరాలు సాధనలు ప్రదర్శనలో ఉంచుతామని పేర్కొన్నారు. వైద్య శిబిరాలు రక్తదానాలు, పోలీసు త్యాగాలపై ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అమరుల కుటుంబాలకు సన్మానాలు చేస్తూ 31న సాయంత్రం క్యాండిల్ ర్యాలీతో పోలీసు అమరవీరుల వారోత్సవాలు ముగిస్తాయన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు దివ్యతేజ స్కూల్ విద్యార్థి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : పట్టణ కేంద్రంలోని దివ్య తేజ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి వెంకట సాయి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు శనివారం ఆ పాఠశాల కరస్పాండెంట్ నాగేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి హిందూపూర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో వెంకట సాయి పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

పాతరే!

ప్రజాదృష్టి

నూతన మద్యం పాలసీ ప్రజారోగ్యానికి గొడ్డలిపెట్టులాంటిది. నూతన పాలసీ అమలు చేయడంలో భాగంగా ప్రయివేటు వ్యాపారులకు గేట్లు తెరచడంపై మహిళలు, మేధావులు, అభ్యుదయవాదుల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. కూటమి సర్కారు పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలను సమిధలుగా చేయడంలో సఫలీకృతమైందనడంలో సందేహంలేదు. ఎక్సైజ్‌శాఖ కడప జిల్లాలో 139 మద్యం దుకాణాలకు 3,257 దరఖాస్తులు స్వీకరించింది. అనంతరం లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసింది. లాటరీ తగలని 3,118 మంది ప్రవేశ రుసుమును పోగొట్టుకుని నిరుత్సాహంతో వెనుదిరిగిపోవడం కనిపించింది. ఇంత వరకు బాగానే ఉంది. వైసిపి సర్కారు హయాంలో కంటే మద్యం ధరలను తగ్గిస్తామని, నాణ్యమైన సరుకును అందుబాటులో ఉంచుతామని చేసిన ప్రచారం బెడిసి కొడుతోంది. సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ మద్యం ధరలు తగ్గే వకాశాలు లేవనే సమాచారంతో మద్యం బాబుల్లో అసహనం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అధిక ధరల కారణంగా పేదలు, సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉండేది. ఇది పేద కుటుంబ అవసరాలను ఒక రకంగా ఉపయోగపడేది. గ్రామసీమల్లో బెల్టు షాపుల బెడద లేకుండా ఉండేది. ఫలితంగా సామాన్య కుటుంబాల్లో ఘర్షణలు లేకుండా సాఫీగా సాగిన పరిస్థితి కనిపించేది. కూటమి సర్కారు నూతన మద్యం పాలసీ అమలు కారణంగా ప్రయివేటు మద్యం దుకాణాలకు గేట్లు ఎత్తింది. 139 మద్యం దుకాణాల్లో 131 మద్యం షాపులకు ప్రొవిజనల్ (తాత్కాలిక) లైసెన్స్ ఇచ్చేశారు. మిగిలిన ఎనిమిదింటికి నేడో, రేపో ఇచ్చే అవకాశం ఉంది. తాత్కాలిక లైసెన్స్ ఇచ్చిన వారం రోజుల తర్వాత పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వడంపై ఎక్సైజ్ యంత్రాంగం దృష్టి సారించింది. ప్రయివేటు మద్యం దుకాణ యజమానుల అత్యాశ కారణంగా పల్లెసీమల్లో బెల్టుషాపులు ఏర్పడతాయనడంలో సందేహం లేదు. వీటిని నివారించడం ఎంతవరకు సాధ్యమో ఆలోచించాలి. గత అనుభవాల దృష్ట్యా బెల్టుషాపులను కట్టడి చేయడం మాట అటుంచితే, బెల్టుషాపులు లేని గ్రామం ఉండదనే వాదన వినిపిస్తోంది. బెల్టుషాపులు ప్రశాంతంగా ఉండే గ్రామసీమల్లో కక్షలు, కార్పణ్యాలకు ఆజ్యం పోసే అవకాశాలు ఉన్నాయనే ఆందోళన నెలకొంది. జిల్లాలో ఫ్యాక్షన్ సంస్కృతి కలిగిన గ్రామాలు, వెనుకబడిన మారుమూల గ్రామాల్లోని పేదలు, సామాన్యులు బెల్టుషాపుల బారినపడి తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయని చెప్పవచ్చు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ అమలు కారణంగా బెల్టుషాపుల కట్టడికి పకడ్బందీ చర్యలు తీసుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నూతన మద్యం పాలసీ అమలు కారణంగా జిల్లా వ్యాప్తంగా రూ.1.48 కోట్లు ఆదాయాన్ని ఆర్జించిందనే గణాంకాలు వినసొంపుగానే ఉన్నాయి. సమీప భవిష్యత్తులో జాతి మూలుగుల్ని పీల్చి పిప్పిచేసే ప్రమాదాన్ని నివారించే తరుణోపాయాల్ని ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రజల చేత, ప్రజల కొరకు ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలి. ఆదాయమే పరమావధిగా ఎంచి, బొక్కసాల్ని నింపు కోవడంపై ఉన్న శ్రద్ధ, ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంపై లేకపోవడం జాతి దౌర్భాగ్యమనే చెప్పాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

సమగ్ర వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-రామాపురం

రైతులు పంటసాగులో సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి వై.నాగమణి పేర్కొన్నారు. మండలంలోని గోపగుడిపల్లిలో శనివారం పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతు పద్ధతులు పాటించిన పొలంలో దిగుబడి, సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటించిన పొలంలో దిగుబడులు వ్యత్యాసాలు రైతులకు చూపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర వ్యవసాయ పద్ధతిలో పోషక ఎరువుల వాడకం, పురుగుల తెగుళ్ల నివారణపై యాజమాన్య పద్ధతులు తెలుసుకోని రైతులకు పంట సాగు చేయడంవల్ల అధిక దిగుబడులు పొందవచ్చునని వివరించారు. అనంతరం హసనాపురం, రాచపల్లి గ్రామాలలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సాయిమహేశ్వరి, శిల్పకళా, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు సుచిత్ర, రామకృష్ణంరాజు కలిసి వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు వరిలో ఉల్లికోడు ఆశించిన పంటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తంబళ్లపల్లె మండలం, చెట్లవారిపల్లెకు చెందిన వెంకటరెడ్డి కొడుకు యశ్వంత్‌రెడ్డి, అదే మండలం మలిగివారిపల్లెకు చెందిన సుబ్బారెడ్డి కొడుకు అజయ్‌కుమార్‌రెడ్డి లు శుక్రవారం కురబలకోట మండలం దాదంవారిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. శనివారం వారి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారనాథరెడ్డి మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. సంతా పాన్ని వ్యక్తం చేశారు. జరిగిన ఘటన దురదృష్టకరమని, బాధితుల కుటుంబాలకు తాను అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట వైసిపి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఉన్నారు.

మునగాకుతో మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి-కలికిరి : మునగ ఆకు తినడం ద్వారా తల్లులకు, పిల్లలకు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్, సర్పంచ్ పేర్కొన్నారు. వాయల్పాడు ప్రాజెక్టు పరిధిలోని కలికిరి మండలం మహల్ సెక్టార్‌లో ఐసిడిఎస్ మునగ ఆకు వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై వివరించారు. ఈ సమావేశంలో మునగ ఆకు, కాయల ప్రాధాన్యతను బాలింతలకు తెలిపారు.మునగ ఆకును ప్రతి రోజూ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. మునగ ఆకులో పోషకాలు ఎక్కువుగా ఉంటాయని తెలిపారు. సి విటమిన్ ఉండటం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. చర్మం, ఎముకలను గట్టిపరుస్తుందని తెలిపారు. క్రమం తప్పకుండా మునగ ఆకు,కాయలను తీసుకుంటే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ సర్తాజ్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్డెమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.7 లక్షలు

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండలంలోని చెర్లోపల్లి గ్రామం శ్రీ రెడ్డెమ్మ దేవత దేవస్థానానికి సంబంధించిన హుండీల లెక్కింపు వలన రూ.7,00,175లు నగదు, 16 గ్రాముల బంగారు, 169 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చిందని ఆలయ ఇఒ మం జుల తెలిపారు. ఈ మొత్తాన్ని సప్తగిరి గ్రామీణ బ్యాంకు వాయల్పాడులో జమ చేసినట్లు తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమం దేవాదాయశాఖ తనిఖీ అధికారి శశికుమార్ పర్యవేక్షణలో లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, బ్యాంకు సిబ్బంది, దేవస్థాన సిబ్బంది, చెర్లోపల్లి గ్రామ సచివాలయ మహిళా పోలీసు పాల్గొన్నట్లు తెలిపారు.

పేరుకే 'రైల్వే'కోడూరు

- డాక్టర్ సయ్యద్ అహ్మద్

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రైల్వేకోడూరు పేరు మార్చాలని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సయ్యద్ అహ్మద్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు–చెన్నై ఉత్తరాది రాష్ట్రాలకు రైల్వే మార్గంగా రైల్వే కోడూరు ఎంతో ప్రాముఖ్యత ఉన్నదని అన్నారు. అనేక ప్రాంతాలకు కోడూరు అనే పేరు ఉన్నప్పటికీ ఈ కోడూరు ప్రాంతానికి రైలు మార్గం ఉండడం వల్ల దీనికి రైల్వే కోడూరు అనే పేరు ఏర్పడిందని అన్నారు. అలాంటి రైల్వే కోడూరు కు ఎన్నడూ న్యాయం జరగలేదని అన్నారు. దాదాపు 1,80 లక్షల మంది ప్రజలు నివసిస్తున్న రైల్వేకోడూరులో చెన్నైకి వెళ్లే ఏ రైలు ఆగకపో వడం అవమానకరం దురదృష్టకరమని అన్నారు. పేరుకే రైల్వే కోడూరుగా ఉంచడం కంటే దాని పేరు మార్చి కోడూరుగా రైల్వే అధికారులు నామకరణం చేయాల్సిందిగా అధికారులను, పార్లమెంట్ సభ్యులను కాంగ్రెస్ పార్టీ ద్వారా కోరుతున్నామని అన్నారు. లేకుంటే ఈ ప్రాంత ప్రజలను దృష్టిలో ఉంచుకొని కరోనాకు ముందు ఏవైతే రైళ్లు ఆగుతు న్నాయో వాటి అన్నింటిని మళ్లీ నిలుపుదల చేసి ప్రజల గమనాలను సుగుమం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డబల్ ఇంజిన్ ప్రభుత్వం రైల్వే పాలి స్తున్నప్పటికీ రైల్వే కోడూరులో రైలు ఆగకపోతే వారికే అవమానకరంగా ఉంటుం దనే వారే ఆలోచించుకోవాలన్నారు.

జయసూర్య కాలనీకి మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రంలో నూతనంగా ఏర్పడిన టిఎన్ జయసూర్య రెడ్డి కాలనీ రోడ్ల, డ్రెయినేజీ, తాగునీటి వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని కాలనీవాసులు కోరారు. శనివారం ఎంపిడిఒ ఉపేందర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తంబళ్లపల్లె టిఎన్ జయ సూర్యరెడ్డి కాలనీలో కొందరు నివాసం ఉండగా పలువురు ఇల్లు నిర్మించు కుంటున్నారని తెలిపారు. క్రాస్‌లో ఉన్న ఎంపిడిఒ వెలుగు ఉపాధి కార్యాలయంతో పాటు, ఎస్‌బిఐ బ్యాంకుకు తమ కాలనీ ద్వారానే ఎక్కువ మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. రోడ్లు సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు సౌకర్యార్థం తమ కాలనీకి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డప్ప రెడ్డి, మస్తాన్, నారాయణరెడ్డి, మంజునాథరెడ్డి, ఈశ్వరప్ప, శంకర, మదన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పూర్తి చేయాలి

- హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలో ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన రికార్డులు వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేయాలని హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర ఆదేశించారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో భూముల వెరిఫికేషన్ ప్రక్రియపై ఆయన ఆరా తీశారు. ఇప్పటి వరకు వంద శాతం క్షేత్రస్థాయిలో భూముల పరిశీలన పూర్తయిందని 80 శాతం రికార్డుల వెరిఫికేషన్ జరిగిందని తెలిపారు. మిగిలిన పని కూడా త్వరగా పూర్తి చేయాలని విఆర్‌ఒలు, సర్వేయర్లను ఆదేశించారు. కొన్ని పంచాయితీల్లో విఆర్‌ఒలు, ఫ్రీహోల్డ్ భూములు వంద శాతం పరిశీలిం చడంలో పురోగతి సాధించలేకపోతున్నారని అన్నారు. ఇందులో నిర్లక్ష్యం వహించ కుండా భూముల పరిశీలన పూర్తిచేయాలని ఆదేశించారు. వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందు బాటులో ఉండి సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలను సమస్యలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ మహమ్మద్ అన్సారీ, ఆర్‌ఐ వీరాంజనేయులు, విఆర్‌ఒ పాల్గొన్నారు.



ఫ్రీహోల్డ్ భూముల వివరాలు తెలుసుకుంటున్న రాఘవేంద్ర

ప్రజా సమస్యలు తీర్చడమే సర్పంచ్‌ల లక్ష్యం : జడ్‌పి డిప్యూటీ సిఇఒ



వీరబల్లి : సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పి డిప్యూటీ సిఇఒ మైథిలి

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రజల సమస్యలను తీర్చడమే సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ముఖ్య ధ్యేయమని ఉమ్మడి జిల్లాల జడ్‌పి డిప్యూటీ సిఇఒ పి.మైథిలి తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండు రోజుల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌ల, వార్డు మెంబర్లు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ శిక్షణా తరగతులలో నేర్చుకున్న విషయాలను క్షుణ్ణంగా గమనించి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను తీర్చాలన్నారు. స్థానికంగా, రాజకీయంగా ప్రజల్లో గుర్తింపు ఉండేది సర్పంచ్‌లేనని అన్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులతో ప్రజలకు అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. ఇష్టానుసారంగా పనులు చేసినట్లయితే ఆ పనులకు బిల్లులు రావని అన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని వచ్చిన నిధులతో గ్రామాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. మట్లీ సర్పంచ్ నాగార్జున చారి తాటిగుంటపల్లి సర్పంచ్ గోపీనాథ్ రెడ్డి, గుర్రప్పగారిపల్లి సర్పంచ్ భర్త ఈశ్వరయ్య, డి.రాజుపల్లి సర్పంచ్ తనయుడు రవి పంచాయతీల సమస్యలను నిధులపై ఉన్న కొరతలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. గతంలో తాము సొంత నిధులతో అభివృద్ధి పనులు చేసినప్పటికీ ఇంతవరకు సంబంధించిన పనులకు బిల్లులు రాలేదని వాపోయారు. అరకొర నిధులతో గ్రామాలలో నెలకొన్న మౌలిక వసతులు ఎలా తీర్చాలని ఆమెను ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపిడిఒ నూర్జ హాన్, ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి, గ్రామ కార్యదర్శిలు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు. **రామాపురం:** పంచాయతీ అభివృద్ధిలో వార్డు నెంబర్లు కీలకమని ఎంపిడిఒ జాషువా పేర్కొన్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పంచాయతీలో తప్పకుండా సమావేశలు సర్పంచ్ అధ్యక్షతన జరుపుకోవాలి తెలిపారు. వార్డు మెంబర్లు సమావేశాలకు తప్పనిసరిగా హాజరై తమ వార్డుల్లో జరగవలసిన పనులు అభివృద్ధిపై చర్చించాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, డ్రెయినేజీ, పారిశుధ్య పనులపై సమావేశాల్లో చర్చించి వార్డుల్లో పనులు జరిగేలా చూడాలన్నారు. ప్రజల అవసరాలు తెలుసుకొని సమావేశాలలో చర్చించాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి పట్నాయక్, ఎఒ చాంద్‌బాషా ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కలకడ

వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించి రోగాలకు దూరంగా ఉండాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎన్‌వి.కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ఎర్రకోటపల్లి పిహెచ్‌సి పరిధిలోని కదిరాయచెరువులోని వడ్డిపల్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాలు ఎక్కువ పడుతున్నాయి కాబట్టి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని అన్నారు. ఎక్కువగా జ్వరాలు, వాంతులు, విరేచనాలు రావచ్చునని పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని చెప్పారు. తాగే నీరు, ఆహారం పరిశుభ్రంగా తీసుకోవాలని ఆహారం, నీటి పైన మూతలు ఉంచాలని, కలుషితమైన నీరు, కలుషితమైన ఆహారం, పులిసిపోయిన ఆహారాన్ని తీసుకోవద్దని చెప్పారు. ఆహారం వేడివేడిగా తీసుకోవాలని వాటి గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా పైపులు లీకేజీలు ఉంటే వెంటనే గ్రామ సెక్రెటరీకి తెలిపి మరమ్మతులు వెంటనే చేపట్టాలని పేర్కొన్నారు. నీటిని కాచి వడపోసుకుని తాగాలని, మల విసర్జనకు మరుగుదొడ్లు ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి. జయరామయ్య పిహెచ్ఎన్ కే.సుబ్బరత్నమ్మ, హెల్త్ సూపర్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పి లావణ్య, ఆరోగ్య కార్యకర్త శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్త బి.కుమారి పాల్గొన్నారు.

బాధితులకు బీమా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి చంగల్ రెడ్డి అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా దరఖాస్తు చేసుకోవడంతో ఎపిజిబి పుల్లంపేట శాఖ సిబ్బంది మృతుడి భార్య తమ్మిరెడ్డి రాణెమ్మకు బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూ.2లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ బ్యాంకులో ప్రధానమంత్రి జీవనజ్యోతి ప్రమాద బీమా చేసుకున్న విషయమే కుటుంబ సభ్యుల ఎవరికి తెలియదని అన్నారు. బ్రాంచ్ మేనేజర్ కృషితోనే తమకు రెండు లక్షల రూపాయల నగదు రావడం జరిగిందని తెలిపారు. బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎపిజిబిలో 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల లోపు ఉన్న ఖాతాదారులందరూ ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం, 18 సంవత్సరముల నుండి 70 సంవత్సరాలు లోపు ఉన్న ఖాతాదారులందరూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం చేసుకొని నాలుగు లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం పొందవచ్చని తెలిపారు. ఇటువంటి మంచి అవకాశాన్ని ఖాతాదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది కె.చంద్రశేఖర్, శశికళ పాల్గొన్నారు.

వైకల్యంపై అవగాహన

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

విభిన్న ప్రతిభావంతుల్లోని నిర్దిష్ట అభ్యసన వైకల్యంను అధిగమించడానికి ఎంఇఒ పద్మావతి, నారాయణ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ఐఇఆర్‌టి ఉపాధ్యాయులు అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ, సహిత విద్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం స్థానిక ఎంఆర్‌సి భవనం లోని భవిత కేంద్రంలో 'డిస్ లెక్సియా, నిర్దిష్ట అభ్యసన వైకల్యం– విద్యార్థులు చదవడంలో ఇబ్బందులపై అవగాహన ర్యాలీ నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. సమాజంలోని విభిన్న ప్రతిభావంతులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ద్వారా అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించి విద్యార్థులు అభ్యసన వైక ల్యాలను అధిగమించేలా తీర్చిదిద్దవచ్చని అన్నారు. తరగతిగదిలో అభ్యసన సమస్యలతో వెనుక పడుతున్న విద్యా ర్థులకు ప్రత్యేక శిక్షణ అందించి వారిని మంచి భవిష్యత్తు దిశగా మళ్లించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఇఆర్‌టి ఉపాధ్యాయులు అనురాధ, సురేష్, న్యామత్‌బీ, ఐఇడిఎస్‌ఎస్ ఉపాధ్యాయులు ప్రదీప, ఉపాధ్యా యులు సుజాత, మాధవి, మీనా, షఫీ ఉల్లా ఖాన్, సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు. **నందలూరు:** విద్యార్థుల్లో ఉన్న అభ్యసనా వైకల్యాలపై అవగాహన కల్పించేందుకు ఎంఇఒలు నాగయ్య, అనంత కృష్ణ ఆదేశాల మేరకు సమ్మిళిత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సమ్మిళిత ఉపాధ్యాయులు రంగస్వామి, వసుంధర పాల్గొన్నారు.

యోగా పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రణీత్

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి ప్రణీత్ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. కడప వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో శనివారం జిల్లా స్థాయి యోగా పోటీలు జరిగాయి. నాగిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రణీత్ రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారిలో రెండవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి మాట్లా డుతూ వ్యాయామ ఉపాధ్యాయు రాలు గౌరీ కృషి వలన ప్రణీత్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని అన్నారు. విద్యార్థి ప్రణీత్, పిఇటి గౌరీలను ఉపాధ్యా యులు అభినందించారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

- మంత్రి కొల్లు రవీంద్రతో టిడిపి ఇన్‌ఛార్జి 'ముక్కా'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రని టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి కోరారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం శనివారం అమరావతిలో ఆయన మంత్రితో భేటీ అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలో సామాజిక బాధ్యత వహించి సంబంధిత గ్రామాల్లోని ప్రజలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లో భాగంగా అభివృద్ధికి మౌలిక రంగాల వసతులు కల్పనకు కృషి చేయాలన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధిలో అవకాశాలను కల్పించడం ద్వారా సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావడం అభినందనీయమని అన్నారు. ఈ దిశగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో గనుల వలన ప్రభావితం అయ్యే ప్రాంతాల ప్రజలకు చేయూతనివ్వాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మంగంపేట గనుల ద్వారా ప్రభావితం అవుతున్నటువంటి పలు గ్రామాల ప్రజలకు రక్షిత మంచినీటి సౌకర్యం, విభిన్న ప్రతిభావంతులకు చేయూత, మహిళల స్వయం సమృద్ధి సాధించడం కోసం,పేద ప్రజలకి నాణ్యమైన విద్య అందించడం కోసం, సహాయ సహకారాలు అందించాలని అందుకు అవసరమైన కార్యాచల ప్రణాళికను రూపొందించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

పల్లెపండుగతో గ్రామాలు అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుల్లంపేట : పల్లెపండుగతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి యువనాయులు ముక్కా సాయివికాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బావికాడపల్లె పంచాయతీ రామాపురం, ఓబులవారిపల్లి మండలం రాళ్లచెరువు పల్లి, కొర్లకుంట, చలంపాలెం గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.90లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణాలకు వారు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంపూర్ణ గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, రాష్ట్ర అభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని అన్నారు. సంక్షోభంలో కురుకుపోయిన రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకురావడానికి సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని సాయి వికాస్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జయశ్రీ, ఎపిఒ శ్రీనివాసులు, నరసాపురం శివాజీ, పోలు ప్రేమ్ కుమార్, జనసేన మండల నాయకుడు పసుపులేటి వెంకట రమణ, టిడిపి మండల అధ్యక్షుడు ఆర్ సుధాకర్ నాయుడు, ఉపాధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.**కలకడ :** పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాతికుంటపల్లి, ఎర్రకోటపల్లి, కోన పంచాయతీలలో సిసి రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు. మండలంలోని రాతికుంటపల్లె పంచాయతీలో ఎగువబట్టవారిపల్లెలో రూ.5లక్షలు, ఎర్రకోటపల్లి పంచాయతీ వెంకటగారిపల్లెలో రూ.5లక్షలు, కోన పంచాయతీ తిప్పిగారిపల్లిలో రూ.7.5 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం రూ.17.5 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించిన్టడ్ల తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి శ్యామల కాంతారావు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, జనార్ధన్ నాయుడు, పివినా యుడు, ఆనంద నాయుడు, పంచాయతీల సెక్రటరీలు పాల్గొన్నారు.

జీవనజ్యోతి ఆనంద నిలయంలో జడ్జి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పుల్లంపేట : రాష్ట్రీయ, జిల్లా న్యాయ సేవ అధికారులు సంస్థ అమరావతి ఆదేశాల మేరకు మండల న్యాయ సేవ అధికార సంస్థ రైల్వే కోడూరు చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి పిజె.తేజసోయ్ శనివారం ఓబులవారిపల్లి మండల పరిధిలోని జీవన జ్యోతి ఆనంద నిలయం, చిన్మయారణ్యంను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమంలో ఉన్నటువంటి అనాధలకు ఆశ్రమం వారు చేపడుతున్న చర్యలు, వారికి కావలసిన కనీస వసతులు, మౌలిక సదుపాయాల గురించి విచారించి తెలుసుకున్నారు. వారికి అందుతున్న సదుపాయాలు, వైద్యం గురించి ఆరా తీశారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి ముక్క వారి పల్లి లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలను హాస్టలను అకస్మిక తనిఖీ నిర్వ హించారు. మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో అందించాలని తెలిపారు. మరు గుదొడ్లను, వంటగదిని పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి : జడ్జి

తంబళ్లపల్లి : హాస్టల్‌లోని బాలికలకు భోజనం మెనూ మేరకు నాణ్యతగా వడ్డించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి , కోర్టు న్యాయమూర్తి మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు ఉమర్ ఫరూక్ తెలిపారు. స్థానిక మోడల్ స్కూల్లోని బాలికల హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్లో వసతి సౌకర్యాలు, వంటగది, పరిస్థితులపై పరిశీలించారు. గదుల్లో పరిశుభ్రత తప్పకుండా పాటించాలని, వార్డెన్ బుజ్జమ్మకు సూచించారు.

22న కలికిరి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కలికిరి : ఈనెల 22 మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ భానుమూర్తి రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఎంపిపి వేంపల్లి నూర్జహాన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు హాజరుకావాలని తెలిపారు.

వేగంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి-బి.కొత్తకోట : ద్విచక్ర వాహనాలను వేగంగా నడపడం, విన్యాసాలు ప్రదర్శించడం చేస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ రాజారెడ్డి పేర్కొన్నారు. శనివారం కొంతమంది యువకులు స్థానిక నిర్మల్‌హృదయ్ కాలేజీ చుట్టూ చక్కర్లు కొడుతున్న పలువురు ఆకతాయిలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలను పోలీసు స్టేషనుకు తరలించి ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో వేచి ఉండి కాలేజీలు వదిలే సమయంలో విన్యాసాలు చేస్తూ ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న యువకుల ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను వేగంగా నడపడం, విన్యాసాలు చేయడం ప్రమాదాలకు కారణమవుతాయని అన్నారు. అమ్మాయిలను వేధించిన, కళాశాల వద్ద వాహనాలను వేగంగా నడిపిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నాగేంద్ర, హోంగార్డు అమ్రేష్ పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి-వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీ పెద్దూరులో పాడైపోయిన తాగునీటి బోరుకు శనివారం సర్పంచ్ నాగార్జునచారి మరమ్మతులు చేపట్టారు. ఇటీవల మట్లి పెద్దూరులో తాగునీటి బోరు మరమ్మతులు రావడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు స్థానిక సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా నాగార్జున చారి మాట్లాడుతూ పంచాయతీలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ అధికారుల సహకారంతో తాగునీటి సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించడమే తమ ధ్యేయంగా పనిచేస్తున్నామని, మట్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి అంకిత భావంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : మండలంలో ఆదివారం మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, మెటీరియల్ కాంపోనెంట్ క్రింద మంజూరైన రూ.1.50 కోట్ల విలువ గల 40 సిమెంటు రోడ్డు పనులను పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 లకు వెంగంవారిపల్లి పంచాయతీలో కార్యక్రమం ప్రారంభమై సాయంత్రం 5.30 లకు తవళం పంచాయితీలో ముగుస్తుందని తెఇలపారు.

వైన్‌షాపును వెంటనే తొలగించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని లక్కీ వైన్స్ బ్రాందీ షాపును వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో ఉద్యమాలకు సిద్ధమవుతామని సిపిఐ మండల కార్యదర్శి రాజబోయిన సెల్వన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మహిళ సమైక్య జిల్లా అధ్యక్షురాలు సరోజినమ్మ మాట్లాడుతూ ఎస్‌బివిడి సభ హైస్కూల్ దగ్గర నుంచి వైన్ షాప్ కి 85 మీటర్ల దూరంలో మాత్రమే లక్కీ వైన్స్ షాపు ఉందని, ఈ బ్రాందీ షాపు వల్ల స్కూల్లో చదివే పిల్లలకు, పోలీస్ స్టేషన్, స్టేట్ బ్యాంక్, రిజిస్టర్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లే మధ్య కాబట్టి విద్యార్థులకు, ప్రజలకు అందరికీ ఇబ్బంది కరంగా ఉందని అన్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ సిఐ, మండల తహశీల్దార్ చొరవ తీసుకొని వెంటనే వైన్ షాప్ ను తొలగించాలని కోరారు.కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి పెంచలయ్య, దుర్గా ప్రజలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-కలికిరి : సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపిడిఒ భానుమూర్తిరావు ఆదేశించారు.కలెక్టర్‌తో టెలి కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన రివ్యూ మీటింగ్‌లో కలెక్టర్ ఆదేశించారని చెప్పారు. పంచాయతీ సెక్రటరీలు, సచివాలయం సిబ్బంది ఉదయం 10.30 లోపు, మధ్యాహ్నం, సాయంత్రం 5 గంటలకు హాజరు నమోదు చేయాలని తెలిపారు. సెలవుపై వెళ్ళనపుడు కార్యదర్శికి, ఎంపిడిఒకు తెలిపి ముందస్తు అనుమతి తీసుకొని వెళ్లాలని ఆదేశించారు.


రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద చిక్కుకున్న అంబులెన్స్

ప్రజాశక్తి-పీలేరు : పీలేరు పట్టణంలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద ఐటిబిపి అంబులెన్స్ చిక్కుకుంది. అక్కడ ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి వాహనాల రాకపోకలకు గంటల కొద్దీ అంతరాయం ఏర్పడింది. కలికిరిలోని ఇండో టిబిటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి)కి చెందిన అంబులెన్స్ తమ సిబ్బందిని వైద్య పరీక్షల కోసం శనివారం పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువచ్చింది. పరీక్షల అనంతరం ఐటిబిపి అంబులెన్స్ ప్రధాన రహదారిపై కాకుండా స్థానిక సాయిబాబా ఆలయం వీధిలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి మార్గంలో తీసుకు వెళ్లే క్రమంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. రైల్వే అండర్ పాస్ కన్నా అంబులెన్స్ ఎత్తు ఎక్కువగా ఉండటంతో అండర్ పాస్ లెవెల్ ఆర్చ్ వద్ద అంబులెన్స్ చిక్కుకుంది. దీంతో వాహనం ముందుకు పోలేక, అలా అని వెనక్కు రావడానికి వీలు లేక పోవడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సిబ్బంది చేసేది లేక చివరికి తమ ఆంబులెన్స్ కున్న చక్రాల నుంచి గాలి తగ్గించి వాహనాన్ని వెనక్కు తీశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాల రాకపోకలను నియంత్రించడంతో సమస్యకు పరిష్కారం లభించింది.

క్రైం కార్నర్

చింతకాయల వ్యాపారి దారుణ హత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



ఖాదర్‌బాషా(ఫైల్ ఫొటో)

కురబలకోటలోచింతకాయల వ్యాపారి శుక్రవారం రాత్రి దారుణ హత్యకు గురై య్యాడు. రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న డంపింగ్ యార్డు వద్ద ఎవరో గొంతు కోసి హతమార్చడం తీవ్ర కలకలం రేపుతోంది. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శనివారం క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో డిఎస్‌పి కొండయ్య నాయుడు, సిఐ రమేష్, ఎస్ఐ దిలీప్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించి కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీ సుల కథనం మేరకు.. కురబలకోట కు చెందిన చింతకాయల వ్యాపారి వేంపల్లి బాబ్జి కుమారుడు ఖాదర్‌బాషా(25) దారుణ హత్యకు గురైయ్యాడు. అటుగా వెళుతున్న స్థానికులు గుర్తించి ముదివేడు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ దిలిప్ కుమార్ సిబ్బందితో వెళ్లి ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టు మార్టం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముగ్గరు నుంచి ఐదు గురు వ్యక్తులు ఈ హత్య చేసి ఉంటారని నిర్ధారణకు వచ్చారు. సంఘటన స్థలంలో లభించిన ఆధారాలతో మదనపల్లి నీరుగట్టువారిపల్లి కి చెందిన ఒకరు, కురబలకోటకు చెందిన మరో నలుగురు ఖాదర్ బాషను కిరాయి హత్య చేసినట్లు ఓ నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. పోలీసులు గంటల వ్యవధిలోని ముగ్గురు నిందితులను అదుపులోకి విచారిస్తుండడంతో ఇప్పటికే పోలీసులు కేసును చేదించినట్లు తెలుస్తోంది. ఆదివారం నిందితులను అరెస్టు చేయనున్నట్లు సమాచారం.

చోరీలకు పాల్పడుతున్న దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాయచోటి పట్టణ పరిసర ప్రాంతాల్లో పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను రాయచోటి పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రాయచోటి డిఎస్‌పి ఎంఆర్.కృష్ణమోహన్ పట్టణ పోలీసుస్టేషన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పట్టణంలో అర్ధరాత్రి గాలివీడు రింగ్ రోడ్డు వద్ద ఉన్న లక్ష్మీపురంలో రెండు ఇళ్లలో ఎవరు లేని సమయంలో తాళాలు పగలగొట్టి ఇద్దరు నిందితులు చోరీకి పాల్పడ్డారని తెలిపారు. వారి వద్ద నుంచి 86.500 గ్రాములు బంగారును స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితులు గతంలో నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని కనిగిరి, వేదాయ పాలెం, యలమంచిలి, నెల్లూరు పత్తిపాడు, సింగరాయకొండ, అద్దంకి, పొదిలి, కావలి, చిలకపూడి, పామూరు, ఒంగోలులో దొంగతనం కేసులు ఉన్నాయని అన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అదుపులో తీసుకొని వారి నుంచి చోరి సొత్తు రికవరీ లో ప్రతిభ కనబరిచిన రాయచోటి అర్బన్ సిఐ పి.చంద్రశేఖర్, ఎస్ఐలు జి.నరసింహారెడ్డి, అబ్దుల్‌జహీర్, కానిస్టేబుల్ రామచంద్రయ్య, బర్కతుల్లా, మహేంద్ర నాయుడు, పెంచలయ్య, మహేంద్రలను ఎస్‌పి అభినందించినట్లు తెలిపారు.